క్లుప్తంగా

బదిలీ హెచ్‌ఎం, టీచర్‌కు సన్మానం



బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం, టీచర్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ మహేష్

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం ప్రాథమికోన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం శ్యామలమ్మ, టీచర్ కుమారికి సోమవారం సర్పంచ్ గాలి మహేష్ బాబు ఆధ్వర్యంలో వీడ్కోలు సన్మానం చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ, హెచ్‌ఎం శ్యామలమ్మ 'నాడు-నేడు'తో పాఠశాలను రూపురేఖలు మార్చి విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యను అందించారని, టెన్త్‌తో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని ఆమె సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ నాగరాజు, డిజిటల్ అసిస్టెంట్ చారుమతి, హెచ్‌ఎం చంద్రశేఖర్, టీచర్ కోదండయ్య, గ్రామ పెద్దలు సదాశివన్, రవిరెడ్డి, శేఖర్, అంగన్‌వాడీ టీచర్ క్రిష్ణవేణి, ఆయా కుమారి పాల్గొన్నారు.

కృపాలక్ష్మిపై నిందారోపణలు చేస్తే సహించం



కృపాలక్ష్మిపై కేసు నమోదు చేయడాన్ని ఖండిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గంగాధరనెల్లూరు: జనసేన నేతలు వైఎస్సార్ సీపీ జీడీ నెల్లూరు ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి నిందారోపణలు చేస్తే సహించేది లేదని జీడీ నెల్లూరు వైస్ ఎంపీపీ హరిబాబు, ఆర్టీఐ నియోజకవర్గ అధ్యక్షుడు ఢిల్లీకుమార్ మండిపడ్డారు. కృపాలక్ష్మికి సోషల్ మీడియా ఇన్‌స్టాగామ్‌లో ఖాతాలేవీ లేవని, ట్రోలింగ్ సంబంధించిన పోస్టులు ఆమె ఏరోజూ పెట్టలేదన్నారు. అయితే జనసేన నేతలు ఉద్దేశపూర్వకంగా పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేసి కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు.

ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు

పాలసముద్రం: జిల్లా ఎంఆర్‌పీఎస్ ఇన్‌చార్జీ మూటూరి మురళి ఆధ్వర్యంలో సోమవారం శ్రీబొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడలో జెండా ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మురళి మాట్లాడుతూ మాదిగలు ఐక్యంగా ఉండి ప్రభుత్వం నుంచి రావాల్సిన హక్కులను సాధించుకుంటామని తెలిపారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పల్లి కిశోర్, ప్రకాష్, నరసింహులు, బాబు పాల్గొన్నారు.

అధిక దిగుబడినిచ్చే పశుగ్రాసం సాగు చేయండి



పశుగ్రాసాన్ని పరిశీలిస్తున్న పుత్తూరు ఉప సంచాలకులు డాక్టర్ గోవిందయ్య, సిబ్బంది

కార్వేటినగరం: పాడి రైతులు అధిక దిగుబడి, అధిక పోషక విలువలు కలిగిన పశుగ్రాసం సాగు చేయడంపై దృష్టి సారించాలని పుత్తూరు ఉప సంచాలకులు డాక్టర్ టి.గోవిందయ్య కోరారు. సోమవారం మండలంలోని అన్నూరులో పశుగ్రాస వారోత్సవాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. అత్యధికంగా పోషకాలు కలిగిన పశుగ్రాసం సాగు చేయడానికి రైతులు వెటర్నరీ సిబ్బందిని సంప్రదించి వారి సూచనలు-సలహాలు పాటించాలన్నారు. అనంతరం పశుగ్రాసంలో రకాలు-వాటి ప్రాముఖ్యత, చాప్ కట్టర్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అన్నూరు రైతు సాగు చేసిన పశుగ్రాసాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీష్, డాక్టర్ హేమకుమార్, డాక్టర్ కృష్ణ, వీఎల్ఓ శ్రీధర్‌రెడ్డి, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దే వైద్యం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కింద ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నట్లు బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ రష్మిత తెలిపారు. సోమవారం మండలంలోని తిమ్మాపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించారు. అనంతరం మంచాన పడిన రోగుల ఇళ్లకు వెళ్లి చికిత్సలందించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సరళ, శిల్ప, సరిత, శివగామి, కిరణ్‌కుమారి పాల్గొన్నారు.



వంద పడకల ఆస్పత్రి



సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు



ఈటీపీ ప్లాంటు

మరపురాని నేత మా రాజన్న

- నగరి మదిలో చెరగని సంతకం.. చెదరని జ్ఞాపకం
- గాలేరు-నగరి ప్రాజెక్టుకు శ్రీకారం
- సమ్మర్ స్టోరేజ్, సీఈటీపీ, వంద పడకల ఆస్పత్రులను నిర్మించిన ఘనత
- నేడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జయంతి

నగరి: నగరి మదిలో ఆయన స్థానం సుస్థిరం. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలకు ఆయన పాలించిన ఐదేళ్లలో పరిష్కారం చూపారు. సుస్థిర అభివృద్ధి ద్వారా శాశ్వత ప్రయోజనాలు చేకూరతాయనే మహాసంకల్పంతో గాలేరు-నగరి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. నేత కార్మికులకు అండగా నిలిచి కామన్ ఈటీపీ, పేదప్రజలకు ఉన్నత వైద్యసేవలకు 100 పడకల ఆసుపత్రి, తాగునీటి సమస్య పరిష్కారానికి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, వంద కోట్ల నిధులతో కుశస్థలి నదిపై ఆనకట్టలు పేదప్రజలకు భూములు, ఇల్లు ఇలా ఆయన చేసిన పనులతో ప్రజల మదిలో చెరగని సంతకం చేసి చెదరని జ్ఞాపకంగా సుస్థిరంగా నిలిచిపోయారు. మంగళవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్ఆర్ సీపీ శ్రేణులతో పాటు అభిమానులు దివంగత మహానేత వైఎస్ఆర్ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా నగరి పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం, అన్ని మండలాల్లో మహానేత వైఎస్ఆర్ విగ్రహం వద్ద కేక్ కటింగ్, పూలదండలు వేసి నివాళులు, అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దివంగత వైఎస్ఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి వివరాలు.

గాలేరు- నగరి

దుర్భిక్ష క్షామ పీడిత ప్రాంతమైన చిత్తూరు జిల్లాకు శ్రీశైలం జలాశయం నుండి వరదనీటిలో మిగులు జలాలను తరలించి వ్యవసాయానికి సాగునీరు, ప్రజల దాహార్తి తీర్చడానికి తాగునీరు అందించడానికి చేపట్టిన గాలేరు-నగరి సుజల ప్రవంతి పథకం చేపట్టారు. జలయజ్ఞంలో భాగంగా 2005లో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. జిల్లాలోని 1,03,500 ఎకరాలకు సాగునీరు అందించడానికి, ఈ జిల్లాలోని ప్రజలకు తాగునీరు అందించడానికి ఈ పథకానికి రూపకల్పన చేశారు. జిల్లాలో మల్లెమడుగు, బాలాజీ రిజర్వాయరు, పద్మసాగర్, శ్రీనివాససాగర్, వేణుగోపాల సాగర్, అక్కడి నుండి పుత్తూరు మండలం వేపగుంట రిజర్వాయరుకు చేరి అక్కడి నుండి నగరి రూరల్ మండలంలోని అడవికొత్తూరులో నిర్మించే రిజర్వాయరుకు నీరు చేరుకుంటుంది.



గాలేరు నగరి ప్రాజెక్టు

మహానేత పాలనలో 70 శాతం పూర్తయిన ఈ ప్రాజెక్టు పనులు తదుపరి పడకేశాయి. మళ్లీ అన్ని పనులు చేయాల్సిన దుస్థితి వచ్చేసింది. గత ప్రభుత్వం ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించి పలు టన్నెళ్లను పూర్తిచేసినా పనులు పూర్తిస్థాయిలో ముగిసేలోపు పాలన మారింది. పనులు పడకేశాయి.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి మున్సిపల్ పరిధి సత్రవాడ శివారుల్లో రూ.36 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే జరిగింది. గాలేరు-నగరి ప్రాజెక్టును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు అనుసంధానం చేశారు. నేడు వేసవిలోనూ నీటి ఎద్దడి లేకుండా సమ్మర్ స్టోరేజ్ నీటితో నిండి మున్సిపల్ ప్రజల దాహార్తిని తీరుస్తోంది.

వంద పడకల ఆస్పత్రి

మహానేత పాలనలో నగరికి రూ.15 కోట్ల వ్యయంతో వందపడకల ఆస్పత్రి మంజూరైంది. అత్యాధునిక హంగులతో నిర్మాణం పూర్తి చేసుకుని ఆధునిక వైద్యాన్ని ప్రజలకు చేరువ చేసింది. ఆయన మరణానంతరం ఆస్పత్రికి ఆదరణ తగ్గినా గత ప్రభుత్వంలో మాజీ మంత్రి ఆర్కే రోజా నాడు-నేడు పథకంలో 5 కోట్ల రూపాయల మంజూరు చేయించారు. ఆస్పత్రిని నవీకరించి డయాలసిస్ వార్డు, ఆక్సిజన్ ప్లాంటులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

రసాయన నీటిని శుద్ధీకరణ

స్థానికంగా నేత సామాజిక వర్గంవారు నూలుకు రంగువేసే ప్రక్రియలో వెలువడే రసాయన నీటి కారణంగా భూగర్భజలాలు కలుషితమవుతుండడతో కొన్నేళ్ల క్రితం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత తలెత్తింది. దీంతో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ప్రతి డైయింగ్ యూనిట్‌కు ఈటీపీ అమర్చుకోవాలని, లేకుంటే మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ దశలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి రసాయన నీటిని శుభ్రపరిచే కామన్ ఈటీపీ ప్లాంటు ఏర్పాటుకు సంసిద్ధత తెలిపి రూ.14 కోట్ల మంజూరు చేశారు. ఆయన పాలనలో వేగంగా జరిగిన పనులు ఆయన మరణంతో మందగించాయి. గత ప్రభుత్వంలో ప్లాంటును వినియోగంలోకి తెచ్చినా ప్రస్తుత పాలనలో ప్లాంటు నిరుపయోగంగా మారింది.

ప్రతి మూడో శుక్రవారం ఆర్టీఐ డే

పుత్తూరు: ప్రభుత్వ ఇటీవల విడుదల చేసిన జీఓ ప్రకారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి నెలా మూడో శుక్రవారం సమాచార హక్కు దినోత్సవాన్ని నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద పుత్తూరుకు చెందిన సమాచార హక్కు వేదిక నాయకులు ధర్నా నిర్వహించారు. సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి మాట్లాడుతూ పుత్తూరులోని ఏ ప్రభుత్వ కార్యాలయంలోనూ ఆర్టీఐ దినోత్సవాన్ని నిర్వహించడం లేదంటూ ఆరోపించారు. సమాచారం కోరి ప్రభుత్వ కార్యాలయాలకు దరఖాస్తు చేస్తే పీఐఓ, అప్పిలేట్ అథారిటీ సైతం స్పందించడం లేదని ఆరోపించారు. ఇందుకు సంబంధించి వేల సంఖ్యలో ఫిర్యాదులు కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ప్రతి మూడో శుక్రవారం ఆర్టీఐ డేను విధిగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తద్వారా కొంత మేరకైనా ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.



కలెక్టరేట్ వద్ద ఆర్టీఐ నాయకుల ఆందోళన

వైఎస్ఆర్ సీపీ కమిటీల నియామకం



ఈశ్వర్‌రెడ్డి



రవికుమార్ రెడ్డి

వెదురుకుప్పం: వైఎస్ఆర్ సీపీలో మిగిలిన వివిధ విభాగాలకు సంబంధించి మండల కమిటీలను నియమించినట్లు మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి సోమవారం ప్రకటించారు. వైఎస్ఆర్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కమిటీలను నియమించినట్లు తెలిపారు.

వాణిజ్య విభాగం

వాణిజ్య విభాగం మండల అధ్యక్షుడిగా అగ్గిచేనుపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సంఘ అధ్యక్షుడు కె.ఈశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎ.సుధాకర్‌రావు, రెడ్డెప్ప, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.నరేష్, బి.సుబ్రమణ్యం, పీహెచ్ హరికృష్ణారెడ్డి, కార్యదర్శులుగా నరేష్, బి.గోవర్ధన్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాగరాజు, రాజేంద్రరెడ్డి, కార్యనిర్వాహక సభ్యులుగా చంద్రమోహన్‌యాదవ్, వినోద్‌కుమార్, కె.ఏకాంబరం, డి.రామారావు, ఎ.కిరణ్‌కుమార్‌రెడ్డి, కె.సుబ్రమణ్యం, డి.చెంచయ్య నియమితులయ్యారు.

సాంస్కృతిక విభాగం

మండల అధ్యక్షుడిగా కె.రవికుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా వాసు, ఎం.మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా కె.అప్పాస్వామిరెడ్డి, కె.రత్నమ్మ, శివ, కార్యదర్శులుగా బి.శివారెడ్డి, చిన్నబ్బరెడ్డి, కె.గోపాల్, బి.విజయశేఖర్‌రెడ్డి, కె.ఢిల్లీబాబు, కార్యనిర్వహక సభ్యులుగా కె.సురేష్, పి.హరినాథ్, టి.హరి, ఎస్.మునస్వామి, పి.అనిల్, పి.వెంకటరత్నంలను నియమించినట్లు పేర్కొన్నారు.

చంద్రబాబు.. పెద్ద మోసకారి



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి

–మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): చంద్రబాబు పెద్ద మోసకారి అని మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. సోమవారం పెనుమూరు మండలంలో పులిగుండు వద్ద ఉన్న కళ్యాణ మండపంలో రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో క్యూర్ కోడ్‌ను నియోజకవర్గం సమన్వయకర్త కృపాలక్ష్మి, ఎంపీపీ హేమలతారెడ్డి, మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ అధికారం కోసం అలివికాని హామీలతో గద్దెనెక్కడం.. ఆతరువాత వాటిని పక్కన పెట్టడం చంద్రబాబు నైజం అన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినా ఒక్క హామీని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేక ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. చంద్రబాబు స్వలాభాల కోసమే రాజకీయాలకు అడుగు పెట్టారని, అందులో భాగంగానే సొంత మామనే వెన్నుపోటుపొడిచి అధికారంలోకి వచ్చారన్నారు. అనంతరం రీకాల్ చంద్రబాబుస్.. మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దొరస్వామియాదవ్, మండల మాజీ కన్వీనర్ సురేష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, నవీన్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, హరికృష్ణ, మనోహర్, దాము, రవి, ఉమాపతి, లోకేష్, గురుమూర్తి, లక్ష్మీపతి, దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నియోజకవర్గం సమన్వయ కర్త కృపాలక్ష్మి

వైభవంగా ధర్మరాజుల తిరునాళ్లు

నగరి: మండలంలోని కృష్ణారామాపురం గ్రామంలో ధర్మరాజుల తిరనాళ్లను పురస్కరించుకొని సోమవారం ద్రౌపదమ్మ ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఊరేగింపుగా వచ్చిన అమ్మవారికి స్థానిక భక్తులు కొబ్బరి కాయలు కొట్టి ఫలపుష్పాలు సమర్పించి కర్పూర హారతులు ఇచ్చి దర్శించుకున్నారు. ఊరేగింపు పూజల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొనగా ఉత్సవ నిర్వాహకులు ఆమెను ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అర్చనలు చేయించి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు తిరుమల రెడ్డి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, స్థానిక నాయకులు ఆనందరెడ్డి, ఏలుమలై రెడ్డి, భాగ్యరాజ్, రవికుమార్, రమేష్, సత్య, రంగనాథం తదితరులు పాల్గొన్నారు.



తిరనాళ్లలో పాల్గొన్న మాజీ మంత్రి ఆర్కే రోజా



ద్రౌపదమ్మ ఊరేగింపు

కృపాలక్ష్మిపై అక్రమ కేసు బనాయించడం దుర్మార్గం

- వైఎస్సార్ సీపీ నేతల మండిపాటు

గంగాధరనెల్లూరు: రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోందని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జీడీ నెల్లూరు ఇన్‌చార్జ్ కృపాలక్ష్మిపై అక్రమ కేసు నమోదు చేయడం దుర్మార్గమని ఆ పార్టీ నాయకులు మండిపడ్డారు. సోషల్ మీడియాలోని ఇన్‌స్టాగామ్‌లో తమ పార్టీ అధ్యక్షుడిపై పోస్ట్ చేశారంటూ జనసేన నాయకులు గంగాధరనెల్లూరు పోలీస్ స్టేషన్‌లో కృపాలక్ష్మిపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిని వైఎస్సార్ సీపీ నాయకులు ఖండించారు. కూటమి ప్రభుత్వంలో అబద్ధపు హామీలతో గద్దెనెక్కి ఇప్పుడు ప్రశ్నిస్తే కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తోందని విమర్శించారు. అసలు ఇన్‌సోట్‌గ్రామ్ అకౌంటేలేని కృపాలక్ష్మి పోస్టింగ్ చేశారంటూ కేసు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటరెడ్డి, పెనుమూరు ఎంపీపీ హేమలత రెడ్డి, గ్రీనింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, స్థానిక సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు కిషోర్‌రెడ్డి , ఆర్టీఐ విభాగ అధ్యక్షుడు ఢిల్లీ కుమార్, నాయకులు ఎస్ఆర్ పురం మండల పార్టీ అధ్యక్షులు మణి, ఎస్సీ సెల్ నాయకుడు కుప్పయ్య, గోవిందరెడ్డి, వేలు మొదలియార్, మోహన్, శేఖర్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయంగా అణగొక్కాలని..



కూటమి ప్రభుత్వం హామీలతో ప్రజలను ఎలా వంచించిందో ప్రజలకు చాటిచెబుతున్న తమ నేత కృపాలక్ష్మిని చూసి ఓర్వలేక జనసేన నాయకులు కేసు నమోదు చేయించడం దారుణం. మహిళలను రాజకీయంగా అణగదొక్కాలని చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు హర్షించరు.

–హేమలత రెడ్డి, ఎంపీపీ, పెనుమూరు


000000



ప్రజల పక్షాన పోరాడుతున్న మహిళా నాయకురాలు కృపాలక్ష్మి తనకు సంబంధం లేని, అసలు అకౌంటేలేని ఇన్‌స్టాగామ్‌లో ఎలా పోస్ట్ చేస్తారు? జనసేన నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం . ఇన్‌స్టాగామ్‌లో ఎవరు పోస్ట్ చేశారో పోలీసులు పరిశీలించాలి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై పెడుతున్న కేసులకు భయపడే ప్రసక్తే లేదు.

–కేఆర్ వెంకటరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు, జీడి నెల్లూరు

ప్రశ్నిస్తే కేసులా..?



కూటమి ప్రభుత్వం హామీల నెరవేర్చకపోవడాన్ని ప్రజలకు చెబుతుంటే సహించలేక జనసేన నాయకులు ఆరోపణలు చేయడం సరికాదు. కృపాలక్ష్మిపై కేసు నమోదు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నాం.

కిషోర్ రెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు, జీడి నెల్లూరు నియోజకవర్గం

డిప్యూటీ ఎంపీడీఓగా మధుసూదన్



మధుసూదన్

కార్వేటినగరం: కార్వేటినగరం డిప్యూటీ ఎంపీడీఓగా బీవీ మధుసూదన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఎంపీడీఓ చంద్రమౌళికి ప్రొసీడింగ్ కాపీని అందజేశారు.

నేడు గ్రామీణాభివృద్ధిపై శిక్షణ

విజయపురం: మండల కార్యాలయంలో మంగళవారం గ్రామీణాభివృద్ధిపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రాజేంద్ర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 25 పంచాయతీకి సంబంధించిన పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, ఇంజినీర్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు తప్పక హాజరు కావాలని ఆయన సూచించారు.

ఐటీఐలో రేపు జాబ్‌మేళా

విజయపురం: మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్ మాధవరం ఐటీఐ కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ భైరవుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాల యజమాన్యంతోపాటు పలు కంపెనీలు సంయుక్తంగా నిర్వహించనున్నాయని, ఆసక్తి కలిగిన యువతీయువకులు సర్టిఫికెట్లతో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఇతర వివరాలకు కళాశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని కోరారు.

20 మద్యం బాటిల్స్‌తో వ్యక్తి అరెస్టు

వడమాలపేట (విజయపురం): అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతని నుంచి 20 బాటిల్స్ స్వాధీనం చేసుకొన్నట్లు వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి సోమవారం తెలిపారు. పాదిరేడు గ్రామానికి చెందిన మాధవయ్య(63) అక్రమంగా మద్యం తరలిస్తుండగా పాదిరేడు గంగమ్మ గుడి వద్ద పట్టుకొని ఆయన వద్ద నుంచి మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు అక్రమ మద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి తనిఖీలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

రసాయన నీటిని ఆపేదెవరు?



కొత్తపేటలో రోడ్డుపై ప్రవహిస్తున్న రసాయన నీరు

– కాలువ పైపులు మూసేస్తే రసాయన నీరు రోడ్డుపై వదులుతాం

నగరి: మురుగు కాలువల్లో ఎడతెరిపి లేకుండా ప్రవహించే రసాయన నీటిని అదుపు చేయడానికి మున్సిపల్ అధికారులు డైయింగ్ యూనిట్లకు అనుసంధానంగా ఉన్న మురుగునీటి కాలువ పైపులను మూసేశారు. డైయింగ్ నుంచి వచ్చే వృథా రసాయన నీటిని శుద్ధీకరించి మళ్లీ మీరే వినియోగించుకోవాలని సూచించారు. అయితే అధికారుల సూచనలు డైయింగ్ యూనిట్‌దారుల చెవికెక్కడం లేదు. మీరు చెప్పేదేంటి.. మేము వినేదేంటి అనే చందాన వ్యవహరిస్తున్నారు. కాలువలు లేకుంటే రోడ్డు ఉంది కదా అంటూ రోడ్డుపై రసాయన నీరు వదిలేశారు. ఈ అంశం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇకనైనా నిబంధనల మేరకు ఈటీపీలు లేని ప్లాంట్లను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పరిశీలించి మూతపెట్టాలని లేకుంటే సమస్య కొనసాగడం తప్ప పరిష్కారం ఉండబోదు. అందరూ రోగాల బారిన పడాల్సిందేనని స్థానికులు తెలుపుతున్నారు.

మునిరత్నంరెడ్డి కుటుంబానికి పరామర్శ

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం గ్రామంలో ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి మునిరత్నంరెడ్డి కుటుంబాన్ని వైఎస్ఆర్ సీపీ నాయకులు పరామర్శించారు. సోమవారం గ్రామంలో పర్యటించిన గంగాధరనెల్లూరు నియోజకవర్గ నాయకుడు ఆనగంటి హరికృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి అత్తూరు భీమశంకర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కొమరగుంట ఎంపీటీసీ మునిచంద్రారెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పేట ధనుంజయరెడ్డి, పారిశ్రామిక వేత్త రాజశేఖర్‌రెడ్డి, నాయకులు లోకేష్‌రెడ్డి, గోవిందరెడ్డి, జయప్రకాష్ ఉన్నారు.